క్లుప్తంగా

డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుపై హర్షం



కొడకండ్ల: సంక్షేమ వసతిగృహాలు, గురుకుల విద్యా సంస్థల్లోని విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డైట్, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచడంతో ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు ఉపయుక్తమవుతుందని శనివారం మండలకేంద్రంలోని టీజీఆర్ఎస్‌జేసీ విద్యార్థినులు వినూత్న రీతిలో సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



బచ్చన్నపేట: మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలను ఇవ్వొద్దని, అలా చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై ఎస్‌కే హమీద్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో జనగామ–బచ్చన్నపేట రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడుపరాదని అన్నారు. ఆటోల్లో పరిమితిని మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. కానిస్టేబుళ్లు నర్సిరెడ్డి, అనిల్, రాకేష్, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



జఫర్‌గఢ్: కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2021–22 బ్యాచ్ టెన్త్ విద్యార్థి ఇల్లందుల అజయ్‌కుమార్ ఎంబీబీఎస్ సీటు సాధించడంతో హెచ్‌ఎం, ఎంఈఓ ఎండీ పర్వేజ్, ఉపాధ్యాయులు శనివారం సన్మానించారు. పాఠశాలలో చదివిన అజయ్‌కుమార్ ఇంటర్మీడియట్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాలలో చదివి నీట్ ఎంట్రన్స్ ద్వారా నిర్మల్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిజాకుమారి, స్వరూపరాణి, విజయశ్రీ, కవిత, అనిల్‌కుమార్, అలీ, రాథోడ్, రాంబాబు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

డాక్టరేట్ గ్రహీతకు..



జనగామ రూరల్: ఇటీవల దక్షిణ భారత దేశ మద్రాస్ ప్రచారక్ సభ వారితో మండలంలోని ఓబుల్‌కేశవాపూర్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు మేడిశెట్టి సూర్య నారాయణ డాక్టరేట్ అందుకున్నాడు. గైడ్ నీరజ ఆధ్వర్యంలో సూర్య బాల కీ కహానీ యోం మే స్త్రీ విమర్శ్ అనే పరిశోధన గ్రంథానికి గాను డాక్టరేట్ అందుకోగా శనివారం పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎన్.నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్‌స్తంభం



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో క్రీడాప్రాంగణంలో ఇనుప విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. క్రీడాప్రాంగణంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ వలయం లేదని, పక్కనే ఉన్న ఇనుప విద్యుత్‌పోల్ ప్రమాదకరంగా ఒరిగి ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగాక చింతించేకన్నా ఈ విషయమై విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిరుద్యోగులతో కులగణన సర్వే విధులు కేటాయించాలి

రఘునాథపల్లి : కుల, రాజకీయ, విద్య, రాజకీయ సమగ్ర సర్వే విధులను నిరుద్యోగులకు కేటాయించి ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగ కైలాసం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక వైపు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తగ్గిపోతుంటే సర్వే పేరిట మూడు వారాలపాటు ఒక్కపూట బదులు నిర్వహించాలనే తీరుతో ప్రాథమిక విద్యకు విఘాతం కల్పించినట్టవుతుందన్నారు.

తండాలకు మహర్దశ

- మట్టిరోడ్లను బీటీగా మార్చేందుకు నిధుల కేటాయింపు
- గిరిజనుల హర్షం

తరిగొప్పుల: మండలంలోని గిరిజన తండాలకు మహర్దశ పట్టనుంది. బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసింది. మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు నిధులు కేటాయించింది. ఇన్నాళ్లుగా తండాలకు లింకురోడ్లు సక్రమంగా లేకపోవడంతో గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. మండలంలోని పలు తండాల ప్రజలు నేటికీ మట్టి రోడ్ల గుండానే పయనం కొనసాగిస్తున్నారు. ఆయా తండాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, నియోజకవర్గ ఎమ్మెల్యే, అధికార పార్టీ పెద్దలు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా యంత్రాంగం నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం బీటీ రోడ్ల నిర్మాణానికి కావాల్సిన నిధులను మంజూరు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మండలంలోని అంకుషాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని శివారు తండాలైన దేశ్యాతండా, బీల్యాతండాలకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. వీటిలో అంకుషాపూర్–దేశ్యాతండాకు 1.5 కిలో మీటర్లకు రూ.127.50 లక్షలు, అంకుషాపూర్–బీల్యాతండా వరకు 3 కిలో మీటర్ల పొడవునకు రూ.255 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు పంచాయతీ రాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయా గిరిజన తండాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



నర్సింగాపూర్ కంకర రోడ్డు



అంకుషాపూర్–దేశ్యాతండా మట్టి రోడ్డు

కూతవేటు దూరం..
బీటీ రోడ్డు నిర్మాణానికి మొండిచేయి

మండలకేంద్రం శివారు గ్రామమైన నర్సింగాపూర్‌కు బీటీ రోడ్డు మంజూరు కాకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. మారుమూల తండాలకు సైతం బీటీ రోడ్డు మంజూరు చేయించిన పాలకులు, నాయకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో తమ ఊరికి బీటీ రోడ్డు వేయిస్తామని హామీ ఇవ్వడమే తప్ప పట్టించుకున్న పాపనపోలేదని వాపోతున్నారు. మండలకేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న తమ గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- విపక్షాల విమర్శలు పట్టించుకోకండి
- ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

లింగాలఘణపురం: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుమిత్ర ప్రభుత్వమని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని ఎంపీ కడియం కావ్య అన్నారు. శనివారం మండలంలోని కళ్లెం, లింగాలఘణపురం, నెల్లుట్ల, కుందారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేస్తుందని, అర్హులైన వారందరికి రుణమాఫీ తప్పకుండా అవుతుందన్నారు. డబుల్ దమాకాలో నియోజకవర్గ అభివృద్ధి చేస్తామని తెలిపారు. మండలంలో ఆరు గ్రామాలకు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తామని ఎంపీ కావ్య హామీ ఇచ్చారు.

ఏడాది కాలంలోనే ఇన్ని విమర్శలా..?

అధికారంలోనికి వచ్చి ఏడాది కాలంలోనే విపక్షాలు రాజకీయాల కోసం విమర్శలు చేయడం తగదని, పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌కు కూడా పదేళ్ల అవకాశం ఇచ్చి అప్పుడు విమర్శించాలని హితవు పలికారు. ఇక బీజేపీ నాయకులు ఒకరిని మించి ఒకరు పత్రికా సమావేశాల్లో మాట్లాడుతున్నారని, ఎక్కడ వెనుకబడిపోతామోనని పోటీ పడుతున్నారని, దమ్ముంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో కొట్లాడి రూ.50వేల కోట్ల గ్రాంట్‌ను తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఉపేందర్, శ్రీశైలం, మార్కెట్ డైరెక్టర్లు శ్రీలతారెడ్డి, మోహన్, పీఏసీఎస్ డైరెక్టర్లు బాలరాజు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిలీప్‌రెడ్డి, డీఏఓ రామారావునాయక్, డీసీఓ మురళిరమణ, ఆర్డీఓ గోపి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అండాలు, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, ఏఓ వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ సీఈఓలు శ్రీనువాసు, మల్లేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య, పక్కన ఎమ్మెల్యే శ్రీహరి తదితరులు

ఆలయాల్లో కార్తీక మాస పూజలు



చిల్పూరు: వారకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



బచ్చన్నపేట: పూజ చేస్తున్న భక్తులు

చిల్పూరు: మండలంలోని చిల్పూరు గుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పవిత్ర కార్తీక మాసం మొదటి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకుల వేదమంత్రాల నడుమ స్వామివారి వార కల్యాణాన్ని ఘనంగా నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. అనంతరం చిల్పూరు గ్రామానికి చెందిన భక్తులు నారగోని లింగయ్య, రాజ్‌కుమార్, విజిత, నరేష్‌కుమార్, సుజని ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.మోహన్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ కె.మోహన్, అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరాలయంలో..

బచ్చన్నపేట: కార్తీక మాసం పురస్కరించుకుని మండలంలోని కొడవటూర్ గ్రామంలోని స్వయంభూ సిద్ధేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ చిందం వంశీ, ఆలయ ప్రధాన అర్చకులు ఓం నమశివాయ, ఆలయ సిబ్బంది నూకల లక్ష్మీకాంత్‌రెడ్డి, బండారి శ్రీనివాస్, గంగం భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసులు స్నేహ పూర్వకంగా మెలగాలి



నర్మెట: సమస్యలతో స్టేషన్‌కు వచ్చే వారితో పోలీసులు స్నేహ పూర్వకంగా మెలగాలని జనగామ ఏసీపీ పార్థసారథి అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన రికార్డులతోపాటు స్టేషన్ పరిసరాలు, క్వార్టర్స్, పోలీస్ సిబ్బందికి సంబంధించిన కిట్లను పరిశీలించారు. వివిధ కేసులకు సంబంధించి ఫైళ్లు, పోలీసు వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన కేసులను సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాల విక్రయాలు జరగకుండా చూడాలని, ఎవరైనా వినియోగిస్తున్న వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ అబ్బయ్య, ఎస్సై నగేష్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం సరికాదు

కొడకండ్ల: ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిపై అసత్య ప్రచారం చేయడం, కొన్ని మీడియా ఛానళ్లలో కూడా కథనాలు ప్రసారం చేయడం సరికాదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. శనివారం గిర్నితండాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిర్నితండాలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పర్యటించిన సందర్భంగా స్థానికుల విజ్ఞప్తితో అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్లను పరిశీలించారని, స్థానిక బీఆర్ఎస్ నాయకులు వచ్చి సమస్యలపై వినతిపత్రం ఇవ్వగా ఎమ్మెల్యే స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారన్నారు. కాగా, దీన్ని కొందరు ఎమ్మెల్యేను ప్రజలు నిలదీశారని, అడ్డుకున్నారని, కొన్ని మీడియా ఛానల్లలో అసత్య ప్రచారం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సమాజంలో మీడియా పాత్ర ఉన్నతమైనందున వాస్తవాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలే తప్ప వాస్తవాలకు విరుద్ధంగా వ్యవహరించి మీడియా ప్రతిష్ఠతను దెబ్బతీసుకోవద్దని ఆయన కోరారు. రాజేష్‌నాయక్, వెంగల్‌రావు, యాకయ్య, బిక్షపతి, యాకేష్, సోమనర్సయ్య, సుధీర్, రవిందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్‌నాయక్

సంక్షిప్త సమాచారం

కొండచిలువ హతం



స్టేషన్‌ఘన్‌పూర్: వ్యవసాయ పొలంలోకి వచ్చిన కొండచిలువ రైతుల చేతిలో హతమైన సంఘటన మండలంలోని చంద్రుతండాలో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రుతండాకు చెందిన మాలోత్ శ్రీను కోత మిషన్‌తో తన పొలంలో వరికోతలు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో మిషన్ కిందికి పెద్ద కొండచిలువ రావడంతో వరికోత మిషన్ డ్రైవర్ భయాందోళనకు గురయ్యాడు. దాంతో గమనించిన రైతులు కొండచిలువను చంపారు. కొండ చిలువ దాదాపు పది ఫీట్లకు పైగా ఉందని, ఇటీవల వ్యవసాయ భూమి చుట్టుపక్కల ఇళ్లలో పెంపుడు కోళ్లను తింటుందని రైతులు తెలిపారు.

పద్మశాలీలకు రిజర్వేషన్లు కల్పించాలి

రఘునాథపల్లి: జనాభా దామాషా ప్రకారం పద్మశాలీలకు రిజర్వేషన్ కల్పించాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకుడు రాపోలు రామ్మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు వినతి పత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బీసీ కులగణన చేపట్టి రాజకీయ, సామాజిక ఆర్థిక న్యాయం చేకూరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

బోధనేతర పనులు అప్పగించొద్దు

పాలకుర్తి: ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం బోధనేతర పనులు అప్పగించడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ పరిస్థితిల్లో కుల గణన పేరుతో ప్రభుత్వం ఉపాధ్యాయులకు వివిధ రకాల పనులు అప్పగించొద్దని అన్నారు. పాఠశాల సమయం ఉదయం పూట పాఠశాల విధులు చేసి మధ్యాహ్నం వేళల్లో ఇతర పనులు చేయించాలనే ఉద్దేశం సరికాదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

పెన్షనర్లకు సహకరించిన వారికే మద్దతు

చిల్పూరు: పెన్షనర్ల సమస్యలు పట్టించుకున్న వారికే రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని పెన్షనర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం.విజేందర్‌రెడ్డి, అధ్యక్షుడు ఇ.ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.కొమురెళ్లి అన్నారు. చిల్పూరులో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి వత్తాసు పలికేవారు తమకు అవసరం లేదని, గత ఎన్నికల్లో నర్సిరెడ్డిని గెలిపించుకుంటే నాలుగేళ్లు కేసీఆర్ ప్రభుత్వం దగ్గరికి రానివ్వలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ తమ సమస్యలు పట్టించుకోలేదన్నారు. ఎవరైతే పెన్షనర్ల సమస్యల పరిష్కానికి కృషి చేస్తారో వారికే మద్దతు ఇస్తామని తెలిపారు.

సంతాపం

దేవరుప్పుల: మండలంలోని కడవెండికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాడబోయిన స్వామి తల్లి లచ్చమ్మ మృతి చెందింది. కాగా, శనివారం లచ్చమ్మ మృతదేహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ నక్క రమేశ్, కవిత రత్నాకర్‌రెడ్డి, నగేష్, రఫేల్‌రెడ్డి, కొమురయ్య, షఫీ ఉన్నారు.

మల్లేశ్ మృతి తీరని లోటు

దేవరుప్పుల: మాదాపురం రెవెన్యూ గ్రామాలకు విస్తృత సేవలందిస్తూ విధి వక్రీకరించడంతో రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పొందిన పందెనబోయిన మల్లేశ్ మృతి మాదాపురానికి తీరని లోటని బీఆర్ఎస్ వర్కింగ్ మండల అధ్యక్షుడు ధరావత్ రామ్‌సింగ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ వారసత్వంగా గ్రామ సేవకుల కుటుంబానికి చెందిన మల్లేశ్ అదే వృత్తిని నమ్ముకుని ఉద్యోగ పర్మినెంటు కోసం నానా అవస్థలు పడ్డారన్నారు. మారుమూల మాధాపురం పరిధి గిరిజన తండాల ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడిన మల్లేశ్ కుటుంబానికి రెవెన్యూ శాఖ తగు న్యాయం చేకూర్చాలని కోరారు.

'హథిరామ్ మఠానికి బంజారాలను దూరం చేసేందుకు కుట్ర'

పాలకుర్తి టౌన్: హథిరామ్ మఠానికి బంజారాలను దూరం చేసేందుకు తిరుమల తిరుపతి దేవాస్థానం, అక్కడి బ్రాహ్మణులు మూకుమ్మడిగా కుట్రలు చేస్తున్నారని సేవాలాల్ జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్‌నాయక్ అన్నారు. శనివారం తిరుపతిలో హథిరాం బావాజీ బర్త్‌డివస్ కార్యక్రమంలో భాగంగా భోగ్ బండారో కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హథిరామ్ మఠాన్ని కాపాడుకోవాలన్నారు. తెలంగాణ బంజారాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఐక్యసంఘటనతో హక్కులు సాధించుకోవాలి



దేవరుప్పుల: రాజకీయాలకతీతంగా ఐక్యసంఘటనతో గౌడ సామాజిక వర్గ ప్రజలు తమ హక్కులు సాధించుకోవాలని గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు, బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు, బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. శనివారం మండలంలోని పెద్దమడూరు గౌడ సామాజిక నూతన కుల ప్రతినిధులను సన్మానించి మాట్లాడారు. నూతన పెద్దమనుషులు భిక్షపతి, శ్రీను, యాదయ్య, నారాయణ, యాదగిరి, ప్రభాకర్ ఉన్నారు.

పట్టణ అభివృద్ధికి కృషి



జనగామ రూరల్: పట్టణాభివృద్ధి జరిగేలా సీపీఎం కృషి చేస్తుందని పార్టీ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అన్నారు. పట్టణంలోని కామాక్షి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 11న నిర్వహించనున్న 20వ సీపీఎం పట్టణ మహాసభను జయప్రదం చేయాలని 5వ వార్డులో శనివారం కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం శాఖ కార్యదర్శి గుండె మల్లేష్ అధ్యక్ష ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకాశ్ మాట్లాడారు. వార్డుల్లో మౌలిక వసతులు, అండర్ డ్రెయినేజీలు, తదితరాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పట్టణంలో పార్కులను ఏర్పాటు చేయాలని, బతుకమ్మ కుంట పార్కులో మౌలితులు కల్పించడంతోపాటు పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. రాగల్ల అంజయ్య, పల్లెర్ల శంకర్, గుంటిపెల్లి బాలు, చింత బాబు, కర్రె శంకర్ తాళ్లపల్లి సైదులు, ములుగురి కుమార్, నల్ల యాకయ్య, కంటి అంజయ్య, బూడిద శ్రీకాంత్, జేరిపోతల యాకస్వామి, మేడ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వే చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయశ్రీ

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను గ్రామాల్లో పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ విజయశ్రీ అన్నారు. మండలంలో ఈ నెల 6 నుంచి చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను విజయవంతం చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో 150 ఇళ్లకు ఒక టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, సర్వేపై కార్యదర్శులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. సమగ్ర సర్వేపై ముందస్తుగా కార్యదర్శులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇంటింటా కుటుంబ సమగ్ర సర్వే ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా చేపట్టాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ నర్సింగరావు, కార్యదర్శులు టి.శ్రీకాంత్, లింగయ్య, సత్యనారాయణ, జేసుమణి, అనురాధ, సంతోష్, నర్మద, నరేష్, వెంకటరమణ, అవినాష్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ ప్రకాశ్‌రావు అన్నారు. శనివారం మండలంలోని బసిరెడ్డిపల్లి, కొడవటూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తేమ శాతం వచ్చి తూర్పార పట్టిన ధాన్యాన్ని రైతు తూకం వేసి వెంటనే మిల్లులకు తరలించాలని అన్నారు. రైతులు ధాన్యాన్ని మధ్య దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ శ్రీనివాస్‌రావు, సీసీ సత్యనారాయణ, ఏఈఓ రాజు, సీఏ గంగం వాణి, నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం తేమ శాతం పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రకాష్‌రావు

కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదు

ఎంఎస్‌పీ జాతీయ నేత మందకుమార్

బచ్చన్నపేట : తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని ఎంఎస్‌పీ జాతీయ నేత మంద కుమార్‌మాదిగ అన్నారు. శనివారం స్థానిక ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైస రాజశేఖర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు ధర్మాసనం ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని తీర్పు ఇచ్చినట్లు అసెంబ్లీలో తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి.. వర్గీకరణ లేకుండానే డీఎస్సీలో టీచర్ పోస్టులు భర్తీ చేసి మాదిగలకు మోసం చేశారని అన్నారు. కార్యక్రమంలో జాతీయ నాయకులు వేల్పుల సూరన్న, బొడ్డు దయాకర్, బొర్ర బిక్షపతి, కొయ్యడ మల్లేష్, ఎంఎస్సీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్, అధికార ప్రతినిధి సందెన నరేందర్, అల్వాల నర్సింగరావు, రాజు, గంధమల్ల ఉదయ్, పాకాల కుమారస్వామి, నల్ల అంజయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంద కుమార్ మాదిగ


విజయవంతం చేయండి



జఫర్‌గఢ్: ఈ నెల 10వ తేదీన మండల కేంద్రంలో నిర్వహించనున్న సీపీఎం మండల మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మహాసభ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ 8వ మండల సభ జఫర్‌గఢ్ గీతాంజలి పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. పార్టీ మండల కార్యదర్శి రాపర్తి సోమయ్య, నాయకులు కాట సుధాకర్, వడ్లకొండ సుధాకర్, నక్క యాకయ్య, నల్లతీగల శ్రీనివాస్ పాల్గొన్నారు.


బీసీల బహిరంగ విచారణకు తరలిన సంఘాల ప్రతినిధులు

జనగామ: హనుమకొండ కలెక్టరేట్‌లో బీసీ రిజర్వేషన్లను దామాషా ప్రకారం అమలు చేసేందుకు నిర్వహించిన బహిరంగ విచారణకు శనివారం జిల్లా విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ, పూసల సంఘం ప్రతినిధులు వెళ్లారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జిల్లా మాతృ సంఘం అధ్యక్షుడు నారోజు రామేశ్వరచారి ఆధ్వర్యంలో కార్పెంటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు దిగోజు సాంబయ్య, స్వర్ణకార సంఘం అధ్యక్షులు ఆకోజు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి పి.రతన్ కుమార్, ఇత్తడి పారిశ్రామిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాలూరి మల్లికార్జునాచారి, రాగి వైకుంఠచారి రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బి.నిరంజన్, కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మీకి కమ్మరి, వడ్రంగి, పంచరి, శిల్పి, స్వర్ణకార చేతులతో తయారు చేసే కుల వృత్తిదారుల సమస్యలపై సవివరంగా మెమోరండం అందించారు. అలాగే జిల్లా పూసల కులస్తుల సమస్యలను లిఖిత పూర్వకంగా బీసీ కమిషన్‌కు ఆ సంఘం ప్రతినిధులు అందజేశారు. జిల్లా పూసల సంఘం అధ్యక్షుడు చిన్నిపెల్లి శ్రీనివాస్, కార్యదర్శి పన్నీరు భానుచందర్, గౌరవ అధ్యక్షుడు పగిడిపెల్లి చంద్రమౌళి, కోశాధికారి వెంకట్రాములు, సంచార జాతుల జిల్లా అధ్యక్షుడు బాలనారాయణ ఉన్నారు.



బీసీ కమిషన్ బృందంతో విశ్వబ్రాహ్మణులు

కేంద్ర బృందం పర్యటన



కొడకండ్ల : జాతీయ ఉపాధి హామీ పనులు, సామాజిక పింఛన్ల అమలుపై కేంద్ర బృందం ప్రతినిధులు జెన్సీ లారెన్స్, జూబైల్ కీయాస్ ఆధ్వర్యాన శనివారం మండల పరిధి రేగుల, రామేశ్వరం గ్రామాల్లో పర్యటించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సీసీ రోడ్లు, ఫీడర్ చానల్స్, జామాయిల్ మొక్కల పెంపకం, కమ్యూనిటీ సోక్‌పిట్స్ పనులతో పాటు సామాజిక పింఛన్లను పరిశీలించారు. అడిషనల్ డీఆర్‌డీఓ చంద్రశేఖర్, డీపీఎం వనితారెడ్డి, ఎంపీడీఓ నాగేశేషాద్రిసూరి, టీఏ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ కుమారస్వామి పాల్గొన్నారు.